





జై జగన్నాథ

వైభవంగా మారు రథయాత్ర

విజయనగరం రూరల్, జూలై 15: మేళతాళాలు.. వేదమంత్రోచ్చారణలు, భక్తుల జై జై జగన్నాథ నామస్మరణల మధ్య విజయనగరంలో జగన్నాథుని రథచక్రాలు ముందుకు కదిలాయి. తొలి రథయాత్ర నుంచి సోమవారం జరిగిన మారు రథయాత్ర వరకూ రోజుకో అవతారంలో జగన్నాథుడు దర్శనమిచ్చారు. మారు రథయాత్ర రోజు విశేష పూజలందుకున్నారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిల పరివారం రథంపై ఆశీనులు కాగా భక్తులు స్వామి వారి రథాన్ని లాగుతూ తన్మయత్వం చెందారు. భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి రథయాత్ర ప్రారంభమైంది. పురోహితులు తొలిపూజ చేసిన అనంతరం భక్తులకు అవకాశం కల్పించారు. రథంపై వున్న స్వామివార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం నుంచి రథం నిలిపే ప్రధాన జంక్షన్ వరకూ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో కోలాటాలు, పులివేషాలు సందడి చేశాయి.

విజయనగరం, నెల్లిమర్ల, ఎస్‌కోట, గజపతి నగరం, రామభద్రపురం, బొబ్బిలి, చీపురుపల్లి, గంట్యాడ, గుర్ల, బాడంగి, బొండపల్లి, జామి, వేపాడలోనూ స్వామి మారురథయాత్ర జరిగింది.

● విజయనగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఉన్న జగన్నాథునికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం నుంచి మండపం జంక్షన్ వరకూ స్వామి వారి ఊరేగింపు సాగింది. దాసన్నపేటలో పురాతన జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసన్నపేట నుంచి నవాబుపేట జంక్షన్ వరకూ రథంలో స్వామి వార్లను ఊరేగించారు. నవాబుపేట జంక్షన్ వద్ద ఎటువంటి శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. అదే విధంగా సంతపేట జగన్నాథ స్వామి ఆలయం వద్దకు కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వరకూ ఊరేగింపు కొనసాగింది. ఉల్లివీధి, కాళ్ల నాయుడు మందిరం వద్ద జగన్నాథ స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

అక్కడ కూడా రథయాత్ర జరిగింది. చిక్కాలవీధిలో వున్న జగన్నాథుని ఆలయం వద్ద భక్తుల కోలాహలం కన్పించింది. ఇక్కడ రథయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పులివేషాలు సందడి చేశాయి. జై జగన్నాథ నామస్మరణతో జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.



దాసన్నపేటలో పురాతన జగన్నాథస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి భక్తుల బారులు

గురువారం గ్రామ సందర్శన

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- పట్టణాల్లోనూ వార్డు సందర్శన
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

కలెక్టరేట్, జూలై 15: గ్రామ, వార్డు స్థాయిలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో జిల్లాలో వచ్చే గురువారం నుంచి గ్రామ, వార్డు సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చేపడుతున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. మండల నోడల్ అధికారి ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులతో కూడిన బృందం ప్రతి గురువారం మండలంలోని ఒక గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామంలో ప్రజా సమస్యలను తెలుసుకుని అవకాశం ఉంటే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, వార్డుల సందర్శనకు వెళ్లే అధికారులు అక్కడి ప్రభుత్వ సంస్థలను సందర్శించి, వాటి పనితీరును, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సరఫరా, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వాటిని మెరుగుపరిచే దిశగా గ్రామ సందర్శనలో చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు సందర్శించి అక్కడి మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, మెనూ అమలు, విద్యార్థుల విషయ పరిజ్ఞానం పరిశీలన, స్కూల్ కిట్ల పంపిణీపై ఆరా తీయడం వంటివి చేయాలన్నారు. ఆసుపత్రుల్లో మందుల లభ్యత, ప్రసవాలు, ఓపీ, వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి కూడా తెలుసుకోవాలన్నారు.


ప్రతి మండలానికీ నోడల్ అధికారి

ప్రతి మండలానికీ ఒక నోడల్ అధికారిని నియమించామని కలెక్టర్ తెలిపారు. నోడల్ అధికారులు గురువారం నుంచి తమకు కేటాయించిన మండలాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నోడల్ అధికారులు, మండల అధికారుల బృందం ప్రతి నెలలో ఒక గురువారం తమ మండల పరిధిలోని ఒక సంక్షేమ హాస్టల్‌లో బస చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జేసీ కార్తీక్, ఇన్‌చార్జి డీఆర్‌వో సుమబాల, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్, పక్కన జేసీ కార్తీక్

చినమేడపల్లి వద్ద గిరిజన యూనివర్సిటీకి కేటాయించిన భూమి



భూచోళ్లు

- గిరిజన వర్సిటీ సమీపంలో తిష్టవేసిన వైసీపీ నాయకులు
- పేదలను బెదిరించి మరీ భూముల అన్యాక్రాంతం
- చక్రం తిప్పిన ఓ కీలక నేత, ఆయన సమీప బంధువు
- కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం

గిరిజన యూనివర్సిటీ రాకమునుపే పరిసరాల్లోని భూములపై వైసీపీ నాయకులు గద్దల్లా వాలిపోయారు. వర్సిటీ వచ్చాక భూముల ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉందని భావించి వీలైనన్ని ఎకరాలను చేజిక్కించుకునేందుకు యత్నించారు. ఈ వ్యవహారంలో జిల్లా స్థాయి కీలక నేత, ఆయన సమీప బంధువు చక్రం తిప్పారు. పేదలను మభ్యపెట్టి, బెదిరించి అన్యాక్రాంతం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం రావడంతో కొందరు రైతులు భూచోళ్ల దందాపై ఫిర్యాదు చేసే ప్రయత్నంలో ఉన్నారు.

-విజయనగరం (ఆంధ్రజ్యోతి) / మెంటాడ

గిరిజన యూనివర్సిటీని మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో ఏర్పాటు చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటన రాకమునుపే కొందరు వైసీపీ జిల్లా నాయకులు అక్కడి భూముల వివరాలు ఆరా తీశారు. రియల్టర్ల అవతారమెత్తారు. రైతులకు మాయమాటలు చెప్పి, కొందరిని బెదిరించి కోట్ల విలువైన భూములను చౌకగా కొనేశారు. కొన్నింటిని అన్యాక్రాంతం చేసేశారు.

మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లోని కుంటినవలస, చినమేడపల్లి పంచాయతీల పరిధిలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు గత ప్రభుత్వం సుమారు 561 ఎకరాలు సేకరించింది. గత ఏడాది ఆగస్టులో నాటి ముఖ్యమంత్రి జగన్, అప్పటి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంఖుస్థాపన చేశారు. ఈ తంతు జరగడానికి ముందు నుంచే వర్సిటీ భూముల వివరాలను వైసీపీ నాయకులు ఆరా తీసి పేదల నుంచి వివిధ మార్గాల్లో తీసుకున్నారు. అయితే అసలు ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగు పడిందే టీడీపీ హయాంలో. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 2014లో కేంద్రం గిరిజన వర్సిటీని మన రాష్ట్రానికి మంజూరు చేసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలోని కొత్తవలస మండలం రెల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేస్తే మంచిదని, తద్వారా ఉమ్మడి విశాఖ జిల్లా గిరిజన ప్రాంతానికి ఇటు ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోని గిరిజనులకు అనుకూలంగా ఉంటుందని భావించింది. కేంద్రబృందం వర్సిటీ ప్రతిపాదిత భూములను పరిశీలించి ఆమోదం తెలిపింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తూ సుమారు 500 ఎకరాలను సేకరించింది. అప్పటి, ప్రస్తుత సీఎం చంద్రబాబు గిరిజన వర్సిటీకి శంకుస్థాపన చేశారు. భూముల చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా పూర్తి చేశారు. ఆపై ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వర్సిటీ స్థలాన్నే మార్చేసింది. మెంటాడ, దత్తిరాజేరు మండలాలకు చెందిన 561 ఎకరాలను సేకరించింది. ఇందులో జిరాయితీ కేవలం 67.50 ఎకరాలు మాత్రమే. మిగిలిన 500 ఎకరాలు డి పట్టా భూములు. కాగా జిరాయితీకి రూ.12లక్షలు, డి.పట్టా భూమికి ఏడున్నర లక్షలు, ఆక్రమణ భూమికి మూడు లక్షలు చొప్పున పరిహారం నిర్ణయించారు. మొత్తంగా సేకరించిన భూముల కోసం రూ.28,79,18,660 ప్రభుత్వం చెల్లించింది. ఆటు తర్వాత వర్సిటీ భవనాలకు కుంటినవలస వద్ద శంకుస్థాపన చేశారు.

భూముల ఆక్రమణకు ప్లాన్..

కొత్తవలస మండలం రెల్లి గ్రామం వద్ద యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే తమ పాచికలు పారవని భావించిన వైసీపీ జిల్లా పెద్దలు ప్రభుత్వం వద్ద తమకున్న పలుకుబడిని ఉపయోగించి స్థలం మార్చేవారు. ఆపై వర్సిటీ భూముల సమీపంలో పేద రైతుల వద్దనున్న భూములపై కన్నేశారు. కారుచౌకగా కొట్టేసిన ప్రబుద్ధులు కొందరైతే.. అన్యాక్రాంతానికి తెగబడిన వారు మరికొందరు. భూములు ఇవ్వబోమని చెప్పిన వారి పట్ల బెదిరింపులకు కూడా దిగినట్లు తెలిసింది. ఈ విధంగా వారు స్వాధీనం చేసుకున్న భూమిపై నిర్దిష్ట వివరాలు అందుబాటులో లేనప్పటికీ వాటి విలువ వందల కోట్లలోనే ఉంటుందన్న అంచనా.

భూబాగోతంపై ఫిర్యాదు..

భూగోతంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు కొందరు రైతులు నిర్ణయించుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. గత ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పి మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన, జిల్లా కీలక నేత తమ్ముడు (ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే), ఆ కీలక నేత నీడలో ఎదిగి ఇటీవల పక్కలో బల్లెంలా మారిన జిల్లాస్థాయి మరోనేత ఆగడాలపై రైతులు చాలా ఆగ్రహంతో ఉన్నారు. నాటి నాయకులు వ్యవహరించిన బినామీ వ్యాపారం గుట్టురట్టు చేసే దిశగా రైతులు ఆలోచిస్తున్నారు. మొత్తమ్మీద యూనివర్సిటీ ముసుగులో ఈ 'భూ'చోళ్ల భూదాహానికి పేద రైతులు బలైన వ్యవహారం ఇప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.



కేజీబీవీల్లో బోధన మెరుగయ్యేనా?

- రెండేళ్లుగా అన్నిచోట్లా ఇంటర్ విద్య అమలు
- ఇంతవరకూ భర్తీకాని లెక్చరర్ పోస్టులు
- గెస్ట్ ఫ్యాకల్టీలతో సరి ● నిరాశలో తల్లిదండ్రులు

రాజాం, జూలై 15: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఇంటర్ విద్య నేటికీ గాడిన పడలేదు. ఇంటర్ విద్య ప్రారంభించి ఆరేళ్లయినా లెక్చరర్ పోస్టుల భర్తీని చేపట్టలేదు. గెస్ట్ ఫ్యాకల్టీతోనే నెట్టుకొస్తున్నారు. ఎంతో ఆశయంతో ప్రారంభించిన ఈ విద్యాలయాలను గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు.

డ్రాపౌట్స్ నియంత్రణతో పాటు ఉపాధి కోసం వలసపోయిన లేక పేద తల్లిదండ్రుల పిల్లల కోసం 15 సంవత్సరాల కిందట కేజీబీవీ బాలిక విద్యాలయాలను ఏర్పాటుచేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లో వీటిని ప్రారంభించారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ బాలికలకు వసతితో కూడిన విద్యను అందిస్తున్నారు. ప్రతీ పాఠశాలలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే పదో తరగతి తరువాత కూడా ఎక్కువ మంది డ్రాపౌట్స్ ఉండడంతో వారి కోసం రెండేళ్ల కిందట కేజీబీవీలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

జిల్లాలో 19 కేజీబీవీల్లో 2018లో ఇంటర్ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులను ప్రవేశపెట్టారు. 2021లో అన్ని విద్యాలయాల్లోనూ ఇంటర్ విద్యను అమలు చేశారు. అంతకుముందు కంప్యూటర్ సైన్స్, అకౌంట్ టాక్సెసన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ గ్రాఫిక్స్, యానిమేషన్, ఫిజియోథెరపీ, సెరీకల్చర్ కోర్సులను ఐదేళ్ల కిందట ప్రారంభించారు. వేటికీ రెగ్యులర్ అధ్యాపకులను నియమించలేదు. వైసీపీ ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్లను నియమించి చేతలు దులుపుకుంది. దీంతో విద్యాబోధన అంతంతమాత్రంగా సాగుతోంది. ప్రస్తుతం ఒక్కో కేజీబీవీలో ఏడుగురు సీఆర్‌టీలతో పాటు ఒక ప్రత్యేకాధికారి విధులు నిర్వహిస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ 200 మంది విద్యార్థులకు వీరే బోధిస్తుంటారు. వసతిగృహ పర్యవేక్షణ బాధ్యతలు కూడా వీరివే.

● ప్రభుత్వం కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసినా వసతులు మత్రం మెరుగుపరచలేదు. గత ఏడాది కొంతమంది గెస్ట్ లెక్చరర్లను నియమించారు. ల్యాబ్ టెక్నీషియన్, సెరీకల్చర్, టాక్సెషన్, గ్రాఫిక్ యానిమేషన్ కోర్సులకు సంబంధించి నిపుణులను నియమించలేదు. దీనికితోడు గత ఏడాది గెస్ట్ లెచ్చరర్ల నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది రిటైర్డ్ అధ్యాపకులను, ఉపాధ్యాయులను గెస్ట్ లెక్చరర్లుగా నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తోంది. పరీక్షలకు ఇంకా ఐదు నెలల వ్యవధే ఉంది. దీంతో తల్లిదండ్రులు నిరాశ చెందుతున్నారు.

అక్రమాలపై ఫిర్యాదులు

కేజీబీవీల్లో సిబ్బంది తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీగా నిధులు పక్కదారి పడుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహార పదార్థాలు, నిత్యావసరాల కొనుగోలులో కొందరు ప్రత్యేకాధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్వీపర్లు, వంటపనివారు వంటి బోధనేతర సిబ్బంది నియామకాల్లో సైతం భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్టు కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. గత ఏడాది చాలా కేజీబీవీల్లో దిగువస్థాయి సిబ్బందిని నియమించారు. సంవత్సరం గడవకముందే కొందర్ని తొలగించారు. ఇదేమని ప్రశ్నిస్తే డబ్బులిస్తే కొనసాగిస్తామంటు న్నారని బాధితులు వాపోతున్నారు. ఈ సమస్యను సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

తారకరామ తీర్థసాగర్‌కు మహర్దశ

- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ఈ ప్రాజెక్టు నుంచే నీరు
- విజయనగరం తాగునీటి అవసరాలు కూడా ● పనులు చేపట్టే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు దశ తిరగనుంది. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణమే దీనికి ప్రధాన కారణం. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు పనులు.. మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందాన నడుస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు వేగవంతం కావడంతో ప్రాధాన్యతా క్రమంలో వెనుకబడి వున్న ఈ ప్రాజెక్టు ముందుకు వచ్చి ంది. ఇటీవల ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టు సమాచారం సేకరించారు. పూర్తి చేయాలంటే ఎన్ని నిధులు కావాలి.. ఏఏ పనులు ఏఏ దశల్లో ఉన్నాయి.. తదితర వివరాలను సేకరించారు. ఈ ప్రాజెక్టుకు ఈ నెలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నిధులు ఇతోధికంగా కేటాయించే అవకాశం ఉంది.

నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 25 వేల ఎకరాలకు సాగునీరుతో పాటు.. విజయనగరం ప్రజలకు రెండు టీఎంసీల తాగునీటి అవసరాలు తీర్చే విధంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. తాజాగా భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జోరందుకోవడం, ఆ ప్రాంతంలో మిగతా పరిశ్రమలు, ఇళ్లకు కూడా నీరు కావాల్సి ఉండడంతో ప్రభుత్వ దృష్టి తారకరామతీర్థసాగర్‌పై పడింది. త్వరగా పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 2006 మే 21న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కేవలం రూ.181 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.


2008 నాటికి అంటే గరిష్ఠంగా 24 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలనుకున్నారు. కుమిలిలో జలాశయంతో పాటు బ్యారేజీ నిర్మాణం, గుర్ల మండలం ఆనందపురం చంపావతి నదికి అడ్డంగా ఆనకట్ట కట్టి అక్కడి నుంచి కాలువ ద్వారా కుమిలికి నీరు పంపించాలన్నది ఆలోచన. కాలువ నిర్మాణానికి అడ్డుగా ఉన్న కొండను తవ్వి టన్నెల్ నిర్మించాల్సి ఉంది. ఆ పనులకు ఇంకా అటవీ శాఖ నుంచి అనుమతులు లేవు. పూసపాటిరేగ మండలం కుమిలి వద్ద ప్రధాన జలాశయం పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి.



తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు

దిక్సూచి DIKSUCHI

జయశంకర్ వర్సిటీలో బీటెక్, బీఎస్సీ ఆనర్స్



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందినవారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19. ◆ **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట్-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం. ◆ పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/JKenkieలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాజ్‌తరుణ్ ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్





రాజ్‌తరుణ్, లావణ్య, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎపిసోడ్ సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌లోకి కొత్త పాత్ర ఎంటర్ అయింది. తన కుమారుణ్ని ట్రాప్ చేసి, మాల్వీ ఆస్తి కాజేసిందని ముంబై నిర్మాత యోగేశ్ తల్లి సంచలన ఆరోపణలు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యోగేశ్, మాల్వీ కాల్ లిస్ట్‌ను కూడా ఆమె బయట పెట్టారు. ఆమె వెల్లడించిన సమాచారం ప్రకారం యోగేశ్ ముంబైలో ఓ చిన్న నిర్మాత. తన చిత్రంలో నటించడానికి వచ్చిన మాల్వీతో ప్రేమలో పడ్డారు యోగేశ్. వీళ్లిద్దరూ రెండేళ్లు సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తనని పెళ్లి చేసుకోవడానికి యోగేశ్ నిరాకరించాడనీ, కత్తితో తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడనీ ఆరోపిస్తూ మాల్వీ కేసు పెట్టడంతో యోగేశ్‌ను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాల్వీ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని, తప్పుడు కేసులు పెట్టి తన కుమారుడిని జైలుకి పంపించిందని యోగేశ్ తల్లి వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య కేసులో మాల్వీ ఇన్‌వాల్వ్ అయిన విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాననీ, అందుకే మాల్వీ బండారం బయటపెట్టాలని వీడియో విడుదల చేస్తున్నాననీ, తన కొడుకు ఇంకా జైలులోనే ఉన్నాడనీ, మాల్వీ అతని కెరీర్‌ను సర్వనాశనం చేసిందని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు యోగేశ్ తల్లి.



ఆ లోటు తీర్చేలా 'డార్లింగ్'

నాని

ప్రియదర్శి, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ "ఈ మధ్య కామెడీ చిత్రాలు తక్కువైపోయాయి. ఆ లోటు తీర్చేలా వచ్చే చిత్రమే 'డార్లింగ్'. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. త్వరలోనే జగదీశ్ అనే కొత్త డైరెక్టర్‌తో మా నిర్మాణ సంస్థలో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇందులో ప్రియదర్శినే హీరో" అని చెప్పారు. "ఈ సినిమా హిలేరియస్ ఎంటర్‌టైనర్. నాకు నటన పరంగా నానినే రోల్ మోడల్" అని ప్రియదర్శి అన్నారు. "కపుల్స్ మధ్య జరిగే సరదా సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు" అని దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పారు. "ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత కె.నిరంజన్ రెడ్డి తెలిపారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్‌చరణ్ విగ్రహం?



లండన్‌లో ఉన్న మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మన హీరో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. రామ్‌చరణ్ పాపులారిటీ, ఆయన ఫాలోయింగ్‌ను గమనించిన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన విగ్రహం తయారీలో సహకరించడం కోసం రామ్‌చరణ్ లండన్‌లోనే ఉన్నారు. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. రామ్‌చరణ్ ఫ్రెంచ్ బార్బెట్ జాతికి చెందిన ఓ కుక్క పిల్ల రైమ్‌ను పెంచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏ దేశం సందర్శించినా తమతో పాటు రైమ్‌ను తీసుకెళ్లడం రామ్‌చరణ్ దంపతులకు అలవాటు. అందుకే రైమ్‌ను ఎత్తుకుని ఉన్న రామ్‌చరణ్ మైనపు బొమ్మనే మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేయనున్నారని సమాచారం.

అందుకే ఆ పెళ్లికి వెళ్లలేదు

తాప్సీ



అపర కుబేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహం రాధికతో జరిగిన సంగతి విదితమే. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు భారతీయ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆడారు, పాడారు. నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అయితే ఈ పెళ్లికి వివిధ కారణాల వల్ల హాజరు కాని సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తను ఆ పెళ్లికి ఎందుకు వెళ్లలేదో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడిస్తూ ఆసక్తికరమైన వాఖ్యలు కూడా చేసింది. 'నాకు వాళ్లతో వ్యక్తిగత పరిచయం లేదు. నా ఉద్దేశంలో పెళ్లి అనేది అనుబంధాలతో కూడిన వేడుక. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య ఏదో రకమైన అనుబంధం ఉండి తీరాలి. అటువంటి వివాహాలకే నేను హాజరవుతా. తెలియని వారి ఇంట జరిగే పెళ్లికి వెళ్లి ఇబ్బంది పడలేను' అని తాప్సీ చెప్పింది. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడడం మొదటినుంచీ తాప్సీకి అలవాటు. అందుకే అంబానీ ఇంట పెళ్లి గురించి కామెంట్ చేయడానికి ఆమె వెనుకాడలేదు.

ఓ మంచి సినిమా మీకు ఇవ్వబోతున్నా



'క' అనే ఒకే ఒక్క పదం టైటిల్‌తో హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రం ట్రేడ్‌లో ఇప్పుడు ఆసక్తిగా మారింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం త్వరలో తెలుగు సహా తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మూడు 'క' లను నమ్ముకుని ఈ 'క' చిత్రం తీశాను. మొదటి క.. కథ. చాలా కథలు విని విభిన్నంగా ఉన్న ఈ చిత్రకథను ఎన్నుకున్నాం. రెండో క.. కిరణ్ అబ్బవరం., మూడో క.. కల. ఒక మంచి సినిమా తీసి పదిమందికి తోడుగా ఉండాలన్నది నా కల, అది ఈ సినిమాతో నెరవేరుతోంది. దర్శకులుగా పరిచయమవుతున్న సందీప్, సుజిత్ తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'ఎటువంటి కథనైనా తెర పైకి తీసుకురావడానికి ధైర్యం కావాలి. కిరణ్ మాకు సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్‌ను ఇచ్చారు. కొత్త డైరెక్టర్స్‌కు అలాంటి టీమ్ దొరకడం అదృష్టమే' అన్నారు దర్శకుల్లో ఒకరైన సుజిత్. మరో దర్శకుడు సందీప్ మాట్లాడుతూ 'ఎంతో రిసెర్చ్ చేసి, 80ల కాలం నాటి వస్తువులను సేకరించి, హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా తీశాం. ఫ్యామిలీ వాతావరణాన్ని క్రియేట్ చేసి మేం టెన్షన్ లేకుండా పని చేసే అవకాశాన్ని కిరణ్ కల్పించారు. 'క' అంటే కిరణ్ అబ్బవరం కాదు.. ఇందులో ఒక ప్రధాన పాత్ర ఉంది. అదేమిటో థియేటర్లలోనే చూడాలి' అన్నారు.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'వీడి పని అయిపోయింది' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిందా లేదా అనేది మనకు మాత్రమే తెలుసు. అలాగే నా పని అయిపోయిందా లేదా అనేది నాకు తెలుస్తుంది. అలా అనిపించినప్పుడు సినిమాలు చేయను. 'క' సినిమా మొదలై ఏడాదిన్నర అయింది. ఒక మంచి సినిమా కోసం మేమంతా కష్టపడ్డాం. ఒక మంచి సినిమాను మళ్లీ మీకు ఇవ్వబోతున్నా. మీ ప్రేమను పొందడానికి ఎదురు చూస్తున్నా. 'క' ప్రొడక్షన్ వర్క్ అంతా రహస్య చూసుకుంది. సినిమా రీచ్ అయ్యాక మాట్లాడతా అని చెప్పింది. అందుకే ఇక్కడికి రాలేదు' అన్నారు.

నటుడు రక్షిత్ శెట్టిపై కేసు



కాపీరైట్ ఉల్లంఘించారనే ఆరోపణలతో శాండల్‌వుడ్ నటుడు రక్షిత్‌శెట్టిపై కేసు నమోదైంది. 'న్యాయ ఎల్లిదె..?', 'గాలి మాతు' అనే రెండు సినిమాల పాటలను అనుమతి లేకుండా ఆయన వినియోగించుకున్నారని ఎంఆర్‌టీ మ్యూజిక్ సంస్థ భాగస్వామి నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బెంగళూరు యశ్వంతపుర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రక్షిత్‌శెట్టిని పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఇష్టపడి చేసిన సినిమా



బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రవికృష్ణ మీడియాతో ముచ్చటించారు. "నాకు రియల్ లైఫ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కే చిత్రాలంటే చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర బాగా నచ్చి కథ విన్న వెంటనే ఒప్పేసుకున్నాను. ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్‌టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది." అని చెప్పారు.

థౌజండ్ వాలా టపాసులు



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సినిమా హిట్ అనిపించుకుంటే సరిపోదు.. కలెక్షన్లలో సునామీ సృష్టించి.. నిర్మాతలకు లాభాల పంట పండించాల్సిందే. వసూళ్ల పరంగా ఒకప్పుడు రూ.వంద కోట్ల కలెక్షన్స్ సాధించడమే అద్భుతమనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా కలెక్షన్ల లెక్కలు మారిపోయాయి. రూ.వంద కోట్లు .. రూ.రెండు వందల కోట్లు.. రూ.మూడు వందల కోట్లు.. రూ..నాలుగు వందల కోట్లు.. రూ.ఐదొందల కోట్లు... ఇదీ లెక్క ఇప్పుడు. అలా పెరుగుతూ వచ్చిన కలెక్షన్ల లెక్కలకు తాజా టార్గెట్ రూ. వెయ్యి కోట్లు. తాజాగా 'కల్కి' చిత్రం రూ. వెయ్యి కోట్ల రికార్డును సాధించడంతో తెలుగు సినిమా సత్తా మరోసారి చాటిచెప్పినట్లయింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతవరకు రూ. వెయ్యికోట్లు వసూలు చేసిన చిత్రాల సంఖ్య ఏడైతే వాటిలో మూడు సినిమాలు మనవే కావడం గర్వంతో కాలర్ ఎగరెయ్యాల్సిన అంశమే.

'యుద్ధం.. యుద్ధం' అంటూ బరిలోకి దిగి బాక్సాఫీస్‌ను షేక్ చేశారు ఆమిర్ ఖాన్. ఆయన నటించిన 'దంగల్' చిత్రం 2016లో రిలీజై.. అప్పటివరకూ ఉన్న సినిమా రికార్డులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. గ్లోబల్ బాక్సాఫీస్ దగ్గర రూ.2వేలపై చిలుకు కలెక్షన్లను సాధించింది. ఈ సినిమా మల్లయోధుడు మహవీర్‌సింగ్ ఫోగట్, ఆయన కుమార్తెల జీవితాల్లోని సంఘటనల ఆధారంగా తెరకెక్కింది.

కలెక్షన్లలో 'మాహిష్మతీ సామ్రాజ్య' విజృంభన


దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి'కి కొనసాగింపుగా వచ్చిందే 'బాహుబలి 2'. 2017లో రిలీజైన ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమ హద్దులు దాటి ప్రపంచవ్యాప్త హిట్‌గా నిలిచి.. అసలు సిసలు పాన్ ఇండియా సినిమా సక్సెస్ అంటే ఎలా ఉంటుందో అందరికీ రుచి చూపించింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రూ.1810 కోట్లు కలెక్షన్ల మార్క్ అందుకుంది.

'అసలు సిసలు మల్టీస్టారర్'


దర్శకధీరుడు రాజమౌళి రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌తో చేసిన మ్యాజికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ కల్పిత పీరియాడికల్ యాక్షన్ డ్రామాలోని పోరాటఘట్టాలు.. పాటలు చూసి పరదేశీయులు ఫిదా అయ్యారు. ఈ సినిమాతో రాజమౌళి సినిమాలకు గ్లోబల్ క్రేజ్ పీక్స్‌కు చేరింది. ఇందులోని 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. హాలీవుడ్ దిగ్గజ దర్శకులు జేమ్స్ కామెరూన్, రూసో బ్రదర్స్ ప్రశంసలు పొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1400 కోట్లు వసూళ్లు చేసింది.



'రాకీ భాయ్' మానియా



యష్ నటించిన 'కేజీఎఫ్'తో కన్నడ ఇండస్ట్రీ వైపు దేశం మొత్తం చూసేలా చేసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'కేజీఎఫ్ 2'తో కన్నడ సినిమా స్థాయి గ్లోబల్ రేంజ్‌కు ఎదిగింది. యాక్షన్ ప్రియులకు అత్యంత చేరువైన ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్లను కలెక్ట్ చేసింది.



'వింటేజ్ కింగ్ ఖాన్' ప్రభంజనం

వరుస ఫ్లాపుల్లో ఉన్న షారుక్ ఖాన్‌ను మళ్లీ హిట్ ట్రాక్‌లోకి ఎక్కించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.వెయ్యి కోట్లు పైచిలుకు కలెక్షన్లను రాబట్టింది. ఇందులో రా ఏజెంట్‌గా షారుక్, ఐఎస్ఐ ఏజెంట్ పాత్రలో నటించిన జాన్ అబ్రహమ్‌తో చేసిన పోరాటాలు సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

'జవాన్' మ్యాజిక్

తమిళ దర్శకుడు అట్లీతో షారుక్ ఖాన్ చేసిన సినిమా 'జవాన్'. సమాజాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడడానికి తండ్రిగా.. కొడుకుగా షారుక్ ఇందులో డ్యూయెల్ రోల్ పోషించారు. అత్యద్భుత పోరాట ఘట్టాలతో అందరినీ కట్టిపడేసిన ఈ చిత్రం దాదాపు రూ.1200 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టింది.

'కల్కి' హవా

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'కల్కి 2898 ఏ.డీ'. జూన్‌లో విడుదలైన ఈ సినిమాలో పురాణాల్ని, సైన్స్ ఫిక్షన్‌ను మిళితం చేసి దర్శకుడు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇందులో అమితాబ్, ప్రభాస్ మధ్య వచ్చే పోరాట ఘట్టాలు.. కాంప్లెక్స్, కాశీ, శంభల ప్రాంతాల విజువల్స్. పతాక సన్నివేశాల్లో ప్రభాస్ కర్ణుడిగా కనిపించే దృశ్యం సినిమా విజయాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. రిలీజైన 15 రోజులకే రూ.1000 కోట్ల కలెక్షన్లను అందుకుని.. మరిన్ని రికార్డులు నెలకొల్పే దిశగా దూసుకుపోతోంది.

నిర్వహణ లేక.. మరమ్మతుకు నోచుకోక


గొల్లపల్లి వద్ద దమ్ముమడిలా మారిన రోడ్డు

● పెండింగ్‌లో కోట్లాది రూపాయల ప్రతిపాదనలు ● ఇదీ బొబ్బిలి డివిజన్ పరిధిలో రోడ్ల దుస్థితి

బొబ్బిలి: బొబ్బిలి డివిజన్ పరిధిలో పలు గామీణప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణ, మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో అప్పట్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రోడ్ల దుస్థితిపై ఆందోళనలు నిర్వహించిన విషయం విదితమే. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్ల కోసం పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలన్నింటికీ గ్రీన్‌సిగ్నల్ ఇప్పించే బాధ్యతలను తీసుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు. ఈ పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో నిధులను విడుదల చేస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా గుంతల మయంగా ఉన్న రోడ్లన్నింటిని పూడ్చిపెట్టి ప్రజలకు సౌకర్యవంతంగా తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో త్వరలో శ్రీకారం చుడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఇవీ మరమ్మతుకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు..

● బొబ్బిలి-తెర్లాం రోడ్డుకు రూ. 10 కోట్లు ● ఉత్తరావల్లి జంక్షన్ నుంచి పాతబొబ్బిలి దగ్గర జిల్లా సరిహద్దు వరకు రూ. 10 కోట్లు ● పనుకువలస-బలిజిపేట-వంతరాం వయా కోమటిపల్లి రోడ్డుకు రూ. 3 కోట్లు ● కోమటిపల్లి రోడ్డుకు రూ. 4 కోట్లు ● బొబ్బిలి-పిరిడి రోడ్డుకు రూ. 2.5 కోట్లు ● నెమలాం-ఉద్దవోలు-గళావల్లి రోడ్డుకు రూ.3.20 కోట్లు ● బూశాయవలస-కోటశిర్లాం రోడ్డుకు రూ.1.50 కోట్లు ● గంగాడ-కోనంగిపాడు రోడ్డుకు రూ. 1.50 కోట్లు ● పక్కి జంక్షన్ నుంచి బర్లి-పెదపెంకి రోడ్డుకు రూ. రూ. 60 లక్షలు ● డొంకినవలస రైల్వే ఫీడరు రోడ్డుకు రూ. 40లక్షలు చొప్పున ప్రతిపాదించిన రోడ్ల పనులన్నీ నిధుల మంజూరు కోసం నిరీక్షిస్తున్నాయి.

ప్లాన్ గ్రాంట్‌లో ప్రతిపాదించిన రోడ్ల వివరాలు..

● సాలూరు-మక్కువ రోడ్డు ఏడు కిలోమీటర్ల దూరం విస్తరణ కోసం రూ. 15 కోట్లు ● బొబ్బిలి పట్టణ పరిధిలో రేజేరు-తెర్లాం రోడ్డులో 3.6 కిలోమీటర్ల దూరం నాలుగు లైన్ల విస్తరణ కోసం రూ.30 కోట్లు ● బొబ్బిలి-పెంట- రంగరాయపురం 12 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 15 కోట్లు ● పినపెంకి-ఆకులకట్ట రెండు కిలోమీటర్ల రోడ్డుకు రూ. 15 కోట్లు చొప్పున అధికారులు ప్రతిపాదించారు.

పొలంలోనే కుప్పకూలి రైతు మృతి

వీరఘట్టం: చిట్టిపూడివలసలో సోమవారం వ్యవసాయపనులు చేస్తుండగా రైతు జక్కు కృష్ణమూర్తి(65) కన్నుమూశారు. గ్రామ సమీపంలోని మరొక రైతు పొలంలో వ్యవసాయ పనులు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమీపంలోని రైతులు అతని వద్దకు వెళ్లి చూసేసరికి మరణించారని గ్రామస్థులు తెలిపారు. ఈయన గుండెపోటుతో మరణించి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఆయనకు వివాహితులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల కిందట భార్య మరణించింది.

పాము కాటుకు మహిళ..

గంట్యాడ: మండలంలోని పెణసాంగ్రామానికి చెందిన కడుపుట్ల రమణమ్మ(40) పాము కాటుకు గురై సోమవారం మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్ఐ సురేంద్ర నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 28న పొలంలోని పనులు చేస్తుండగా ఆమె పాముకాటు గురయ్యింది. కుటుంబీకులు వెంటనే చికిత్సకోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు: ఏఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో భూకబ్జాలు, బెదిరింపులకు పాల్పడేవారిపై విచారణ చేపట్టి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 29 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీ తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలు నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐలు విజయనాద్, నర్సింహమూర్తి, ఎస్ఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఆస్మాపరహీన్

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

● ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి



రామభద్రపురం: మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రామభద్రపురం: పసికందుపై అత్యాచారయత్నం చేసిన మానవమృగం ఎరకన్నదొరను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి డిమాండ్ చేశారు. సోమవారం గాంధీబొమ్మ జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.కార్యక్రమంలో సీఐటీయూమండల కార్యదర్శి శ్రీనివాసరావు, అంగన్ వాడీ నాయకులు కూనిశెట్టి సత్యవతి, రాధ, పండు లక్ష్మీ, రమణి, రమా పాల్గొన్నారు.

●**విజయనగరం దాసన్నపేట:** జిల్లాలోని రామభద్రపురం ప్రాంతంలో పసిపాపపై అత్యాచార ఘటన బాధాకరమని డీసీఎంఎస్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. సోమవారం ఆమె నివాసంలో మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి సంఘటనలు జరగడం దారుణమన్నారు.

●**రాజాం:** రామభద్రపురం మండలంలో చిన్నారిపై అత్యాచారం చేసిన వ్యక్తిని శిక్షించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటువంటి మానవ మృగానికి నడిరోడ్డుపై ఉరికంబం ఎక్కించినా తప్పులేదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మానవ మృగాలు పెట్రేగిపోకుండా ఉండడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు.

క్రీడా రంగంలో రాణించాలి: డీఈవో

విజయనగరందాసన్నపేట: విద్యార్థులు విద్యతోపాటు క్రీడారంగంలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సౌత్‌ఇండియా కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటేలో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పెంకి అశ్విని, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి పాండ్రంకి సంతోష్‌కుమార్, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

●గోపాలరాయుడిపేట పంచాయతీ గిరిజనుల వినతి


బొబ్బిలి: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన గిరిజనులు

బొబ్బిలి: తమగ్రామాలకు కనీససౌకర్యాలు కల్పించాలని మండలంలోని గోపాలరాయుడిపేట పంచాయతీపరిధిలోని గిరిజనగ్రామాల ప్రజలు ఎం.రాజుబాబు, మోహన్, బిహును తదితరులు కోరారు. సోమవారం వారంతా బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కృపావలస, చినఅక్కేనవలస, రియాన్‌వలస, చియాన్, రామన్నవలసలో 2000నుంచి నివాసముంటున్నామని, ఇంతవరకు తమకు విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు.

తారు రోడ్డును తొలగించాలి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలో గల సర్వే నెంబరు 99-01 జగన్నాథబందలో విజయనగరానికి చెందిన కొందరు లేఅవుట్‌కు వేసిన తారురోడ్డును తొలగించాలని ఉపసర్పంచ్ మేడపురెడ్డి గణేష్, పలువురు వార్డు సభ్యులు కోరారు.ఈ మేరకు వారంతా సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ జగన్నాథబందలో ఆక్రమించి, వాల్టా చట్టం అతిక్రమించి రోడ్డువేయడంపై గతప్రభుత్వంలో పలుసార్లు ఫిర్యాదుచేసినా స్పందించలేదని తెలిపారు. అప్పటి అధికారపార్టీకి చెందిన వారు చర్యలు తీసుకోలేదని, ప్రస్తుతం అధికారంలోఉన్న కూటమి ప్రభుత్వం చెరువును రక్షించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఆక్రమించిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

జేఎస్‌ఎల్ కర్మాగారంపై చర్యలు తీసుకోవాలి

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీలోగల జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్‌ఎల్ కర్మాగారం 60 రోజులు దాటుతున్నా తమ సమస్య పరిష్కరించలేదని, కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తి వేసేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జేఎస్‌ఎల్ కర్మాగారంలో 57 మంది ఎంప్లాయిస్ కార్మికులు, 264 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని యాజమాన్యం కార్మికులు, రాష్ట్రప్రభుత్వానికి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ విధించిందని చెప్పారు. యాజమాన్య వైఖరి వల్ల కార్మికులంతా ఉపాధికోల్పోయి, వీధిన పడాలసి వచ్చిందని, జేఎస్‌ఎల్ యాజమాన్యంపైప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

సామాజిక తనిఖీని పక్కాగా చేపట్టాలి: ఎస్ఆర్పీ

రామభద్రపురం: ఉపాధిహామీ పథకం కింద త్వరలో జరగనున్న సామాజిక తనిఖీని పక్కాగా చేపట్టాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ కె.మన్మధరావు సూచించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈఏడాది మార్చి 31వరకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, హౌసింగ్, పెన్షన్లు సంబంధించి ఆడిట్ నిర్వహిస్తున్నామని, సుమారు రూ.16.98కోట్లు పనులకు ఈఆడిట్ నిర్వహించాల్సిఉందని తెలిపారు. గ్రామాల్లో తనిఖీలకు వస్తున్న డీఆర్పీలకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో గొలగాని త్రినాథరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపండి

●*23 నుంచి ఆధార్ అప్‌డేషన్ శిబిరాలు : కలెక్టర్ అంబేద్కర్*

కలెక్టరేట్: ప్రజల నుంచి వచ్చిన ప్రతిసమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు.ఆ సమస్యలను ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వారంరోజుల్లో పరిష్కరించాలని స్పష్టంచేశారు. మండల స్థాయిలో పరిష్కరించదగిన వినతులను అక్కడే పరిష్కరించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో ప్రజల వినతులు పరిష్కారంపై కలెక్టర్ మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి 188 వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఏ ఒక్క మండలంలోనూ అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్న మాట వినిపించకూడదని, వాటిపై తహసీల్దార్లు గట్టి నిఘా ఉంచాలని చెప్పారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా వినతులు పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆలస్యంగా హాజరయ్యే అధికారులపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఆధార్‌లో ఆయా వ్యక్తులు తాజా సమాచారంతో అప్‌డేషన్ కోసం గ్రామ, వార్డు సచివాలయాలు సిబ్బంది ఆధ్వర్యంలోఈనెల 23నుంచి 27వరకూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. దీనిపై విద్యార్థులు, ఆయా వర్గాల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.కాగా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నా ఊరు విజయనగరం సంస్థ అధ్యక్షురాలు గుమ్మ లూరు విశాలక్ష్మి రూ.35 వేలు కలెక్టరు అంబేద్కర్‌కు సోమవారం అందజేశారు.


కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న విజయనగరం టీడీపీ నాయకులు

సచివాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలి

విజయనగరం పట్టణంలో ఉన్న వార్డు సచివాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని టీడీపీ నాయకులు కోరారు.ఈ మేరకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించారు. సుమారు 53 కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడం వల్ల వాటి అద్దె నగర పాలక సంస్థ సాధారణ నిధులు నుంచి చెల్లిస్తున్నట్లు తెలుస్తోందని చెప్పారు. వెంటనే సచివాలయాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాద్ కోరారు.

మెరుగైన క్రీడాకారులు తయారుకావాలి

● *శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి*

శృంగవరపుకోట: మెరుగైన క్రీడాకారులు తయారుకావాలని శృంగ వరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆకాంక్షించారు.సోమవారం శృంగవరపుకోటలోనిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, ఇందుకూరి శ్రీనిరాజు పాల్గొన్నారు.


ఎస్.కోటలో ఇండోర్‌స్టేడియం ప్రారంభిస్తున్న లలితకుమారి

●విశాఖలోని కేజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే లలిత కుమారి పాల్గొని వైద్యసేవలపై సలహాలిచ్చారు.

యంత్రాలతో చేపట్టిన పనుల పరిశీలన

బాడంగి: గోపీనాథ్ పట్నాయక్ చెరువులో పనులను ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడులకు గోపీనాథ్ పట్నాయక్ చెరువుకు నీరు పోయేమార్గం లేదని రైతులు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే, రైల్వే అధికారులు చెరువు ఆయకట్టుకు నీరు పోయేందుకు యంత్రాలతో పనులు ప్రారంభించగా ఎమ్మెల్యే సోమవారం ఆ పనులను పరిశీలించారు. పెదపల్లి, తెంటువలస, పింద్రంగివలస, వీరసాగరం, డొంకినవలస రైతులు హర్షం వ్యక్తం చేశారు.


పనులు పరిశీలిస్తున్న బేబీనాయన

మెకానిక్ ఈశ్వరరావుకు పురస్కారం

విజయనగరం దాసన్నపేట: నగరానికి చెందిన బుల్లెట్ మెకానిక్ గొలుసు ఈశ్వరరావు తిలక్ పురస్కారానికి ఎంపికయ్యారు. స్థానిక ఉడాకాలనీ ఫంక్షన్ హాల్లో కేఎస్ తిలక్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఈశ్వరరావుకు ప్రదానంచేసింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు కందాల అశోక్, నాలుగెస్సల రాజు, ఎర్రినాయుడు, విజయరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కొర్నాన రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


ఈశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

తప్పుడు ప్రచారానికి స్వస్తి పలకండి

● *జామి మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు*

జామి: ఇక నుంచైనా తప్పుడు ప్రచారానికి స్వస్తిపలకాలని జామి మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు కోరారు. సోమవారం జామిలో ఏర్పా టుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లోట్లపల్లిలో ఇటీవల భీమసింగి చక్కెర కర్మాగారం గురించి మంత్రి శ్రీనివాస్‌చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవుపలికారు. కర్మాగారం మూసేస్తామని మంత్రి ఎక్కడ పేర్కొనలేదని, చక్కెర కర్మాగారాల ప్రస్తుత పరిస్థితి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రమణ, పైడిరాజు, సూర్యారావు,సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సుగర్స్‌పై మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు

భీమసింగి చక్కెర కర్మాగారం మూసేస్తామని పరోక్షంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యలు సిగ్గుచేటని, నాటి ప్రభుత్వంలో మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పిన మాటలనే నేడుకూటమి ప్రభుత్వం అనుసరించేలా కనిపించడం మంత్రి వ్యాఖ్యలు బలం చేకురుస్తున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, చల్లాజగన్ తెలిపారు. సోమవారం జామిలో వారు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం మూసేసిన ఫ్యాక్టరీను తెరిపిస్తామని యువగళంలో చెప్పిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ మాటలు నీటమూటల అని ప్రశ్నించారు.

ప్రత్యామ్నాయ కర్మాగారం ఏర్పాటుచేయాలి

జామి: భీమసింగి చక్కెర కర్మాగారం స్థానంలో వేరే కర్మాగారం ఏర్పాటుచేస్తామన్నసంకేతాలను ప్రభుత్వంఇస్తోందని,ఈప్రక్రియను వేగవంతంచేసి ప్రత్యామ్నాయ కర్మాగారం ఏర్పాటుచేసి రైతులు, కార్మికులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు.ఈ మేరకు సోమవారం ఆయన కర్మాగార ఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండలంలోని పర్యటించిన మంత్రి శ్రీనివాస్ రాష్ట్రంలో చక్కెర పరిశ్రమలకు మనుగడ లేదని ప్రకటించడంతో పాటు ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జాగరపు ఈశ్వరప్రసాద్, గొర్రిపాటి శ్రీనువాస్,సిరికి అప్పారావు పాలొల్గన్నారు.

రైతులకు మేలు చేయండి

బొబ్బిలి: రైతులకు ఈనెల 23 నుంచి నిర్వహించనున్న పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మేలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారని ఏడీ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన్ను జిల్లాకు చెందిన వ్యవసాయశాఖాధికారులు సోమవారం శ్రీకాకుళం జిల్లాలో ఆయన స్వగ్రామంలో కలిశారు. బొబ్బిలి వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్, ప్రకాశ్, మడక సూరి నాయకత్వంలో కలిశారు.


అచ్చెన్నాయుడును కలిసిన వ్యవసాయశాఖాధికారులు

సెల్‌టవర్ తొలగించాలి

● *కొండచాకరాపల్లిలో గ్రామస్థుల నిరసన*

వంగర: మండలంలోని కొండచాకరాపల్లిలో నిర్మించిన సెల్‌టవర్ తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.ఈమేరకు సోమవారం గ్రామంలో నిరసనతెలిపారు. జనావాసాల్లో సెల్‌టవర్ ఏర్పాటుచేయడంతో సెల్ రేడియేషన్ వల్ల క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. ఇప్పటికే నిర్మించిన సెల్‌టవర్‌కు 5జీ సేవలు పునరుద్ధరించేందుకు వచ్చిన సిబ్బంది వెనక్కి వెళ్లాలని కోరారు. లేకపోతే తీవ్రపరిణామాలు చోటుచేసుకుంటామని గ్రామస్థులు హెచ్చరించారు.వచ్చిన సిబ్బంది వెనుతిరగడంతో గ్రామస్థులు శాంతించారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

విశాఖ-అరకు రోడ్డు వెడల్పు తగ్గించాలి

కలెక్టరేట్: విశాఖ నుంచి పెందుర్తి, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, ఎస్‌కోట మండలాల నుంచి అరకు వరకు విస్తరించనున్న రోడ్డు వెడల్పు తగ్గించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘ నాయకులు డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోడ్డుకు అనుకునిఉన్న రైతులు,ప్రజలు అభిప్రాయాలు తీసుకోకుండా విస్తరిస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ కన్వర్షన్ చేసుకున్నవారికి, చేసుకొని వారికి ప్రభుత్వ కన్వర్షన్ ప్రకారం పరిహారం అందజేయాలని కోరారు.

డిపాజిట్లు వెంటనే చెల్లించాలి

సహారా ఖాతాదారులకు ,ఏజెంట్లుకు న్యాయం చేసి, డిపాజిట్లు చెల్లించాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఖాతాదారుల డిపాజిట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు.పలువురు ఖాతాదారులు నిరసనచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు.కార్యక్రమంలోని ఏజెంట్లు, డిపాజిట్‌దారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న రైతులు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

రాజాం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసు కోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తసంపద కేంద్రాలకు చెత్త తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

113 మలేరియా హైరిస్క్ గ్రామాల గుర్తింపు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 113 మలేరియా హైరిస్క్ గ్రామాలను అధికారులు గురించారు. జిల్లాలో మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. ఇటీవల జడ్పీ సమావేశంలో వ్యాధులపై సభ్యులు నిలదీయడంతో నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఫైలేరియాకు సంబంధించి 68 గ్రామాలను గుర్తించారు. వీటిలో ఎక్కువ గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. రామభద్రాపురం మండలంలోని అరికతోట పీహెచ్‌సీ పరిధిలోని కొన్నిగ్రామాలు, మెంటాడ, చల్లపేట, ఎస్.కోట నియోజవర్గంలోని కొట్టాంలో ఏటా ఎక్కువమంది మలేరియా బారిన పడుతున్నట్లు వైద్య ఆరోగ్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పారిశుద్యలోపం తదితర కారణాలతో ఎక్కువ సంఖ్యలో మలేరియా, ఫైలేరియా వ్యాధుల బారినపడుతున్నారు.ఈనేపథ్యంలో దోమల నివారణకు కావల్సిన గంబూషీయా చేపలకోసం రూ.32 వేలు అడ్వాన్స్ కూడా ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు చేప్పారు. కాగా జులై, ఆగస్టులో ఎక్కువ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో సచివాలయ సిబ్బందికి గ్రామాల్లో కాలువలు, గుంతలు, కళ్లాలు, నీరు నిల్వలు ఉన్నచోట దోమల నివారణ మందును పిచికారీ చేయాలని కోరినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్నట్లు చెప్పారు.

మహిళలపై వేధింపులను నిరోధించాలి

● *బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ*

బొబ్బిలి: పనిప్రదేశంలో మహిళలపై లైంగికవేధింపులు నిరోధించాలని బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో లైంగికవేధింపుల నిరోధకచట్టం-2013పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్గత కమిటీలుప్రతీచోటా ఉండాలని తెలిపారు. వేధింపులకు గురైన వారు నెలలోగా అంతర్గత కమిటీలకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి, ఐసీడీఎస్ పీవోలు జె.విజయలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి, నాగమణి, డివిజన్ పరిధిలో గల మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఎస్ఐలు, ఏఈలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయిశ్రీ

ఆర్టీసీ సేవలు మెరుగుపరుస్తాం

● *కలెక్టర్ అంబేద్కర్*

రాజాం: జిల్లాలోఆర్టీసీ ప్రజా రవాణా సర్వీసులు మెరుగుపరుస్తున్నట్లు కలెక్టర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో పల్లెకు చేరని ప్రగతి రథచక్రాలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో స్పందించారు. విజయనగరం డిపో నుంచి జిల్లా వ్యాప్తంగా 75 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 250 గ్రామీణ సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్లు సౌకర్యం ఉన్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ పల్లెవెలుగులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రజా రవాణాతో పాటు ఆర్టీసీ కార్గో సర్వీసులు సైతంనడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

సూక్ష్మ సేద్యానికి సంపూర్ణ సహకారం

జిల్లాలో సూక్ష్మ సేద్యానికి అన్ని విధాలా సహకరిస్తున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు, ఆంధ్రజ్యోతిలో ఈనెల పదోతేదీన సూక్ష్మసేద్యం నిర్వీర్యం శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో సూక్ష్మసేద్యానికి అన్ని విధాల సహకారించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, కొత్త మార్గదర్శకాలు రావాల్సిఉందని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం హయాంలో సూక్ష్మసేద్యానికి రాయితీలతోపాటు సౌకర్యం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులకు మరిన్ని రాయితీలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొద్దిరోజుల్లో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలవుతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతుకు సూక్ష్మసేద్యం పథకం అందజేస్తామని తెలిపారు.

రేపు నారాయణ తీర్థ జయంతి

విజయనగరం రూరల్: విజయనగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ 679వ కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణ తీర్థ జయంతి నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు డి.సర్వేశ్వరరావు, మండపాక రవిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన కళాకారుడు ఎల్.శ్రీనివాస్ బృందం నామ సంకీర్తనలు ఆలపిస్తుందని పేర్కొన్నారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

బొబ్బిలి: జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. సోమవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీ క్రియాశీల సభ్యత్వం పొందిన వారందరికీ బాధ్యతాయుతమైనకర్తవ్యాలు అప్పగిస్తారని తెలిపారు. జనసేన భావజాలానికి ఆకర్షితులై మద్దతు పలికేవారంతా క్రియాశీల సభ్యత్వాలను స్వీకరించాలని కోరారు.

కొత్తవలసలో కంటి పరీక్షలు

కొత్తవలస: కొత్తవలసలోని రాష్ట్ర పింఛన్‌దారుల సంఘం భవనంలో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలు, పదవీవిరమణ చేసి పింఛన్‌దారులు వారి కుటుంబాలకు కంటి పరీక్షలను ఉచితంగా విజయనగరానికి చెందిన వేంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది హాజరుకాగా 17 మందికి కంటి ఆపరేషన్లకు అర్హులుగా గుర్తించారు. వీరికి విజయనగరంలో పుష్పగిరి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు పింఛన్ దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

పాల సంఘం అధ్యక్షుడిగా ఈశ్వరరావు

వేపాడ: మండలంలోని బల్లంకి విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్ష ఎన్నికకు సంబందించి సోమవారం డెయిరీ యాజమాన్యం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామానికి చెందిన డేగల ఈశ్వరరావు విజేతగా నిలిచారు. పాల సంఘం అధ్యక్ష పదవికోసం టీడీపీ నుంచి ఈశ్వరరావు, వైసీపీ నుంచి బొడ్డు శ్రీనివాసరావు పోటీ పడ్డారు. ఈ మేరకు ఈశ్వరరావుకు 77 మంది, శ్రీనివాసరావుకు 71 మందిపాల ఉత్పత్తిదారులు మద్దత్తు తెలిపారు. ఆరు ఓట్ల మెజార్టీతో పాల సంఘం అధ్యక్షుడిగా డేగల ఈశ్వరరావు విజయం సాదించినట్లు డెయిరీ అధికారులు ప్రకటించారు. ముందస్తు ఒప్పందం ప్రకారం రెండు వర్గాలు చెరో నలుగురు డైరెక్టర్లు చొప్పున ఎంపిక చేసి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కాగా వల్లంపూడి ఎస్ఐ రాజేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్.కోటలో ఆశీలు వేలం పాట

శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు రోజు వారీగా కూలీ అందించేందుకు సోమవారం నిర్వహించిన వేలం పాటలో కాంట్రాక్టరు వాకాడ రమణ రూ.350కు పాడారు. ఆయనొక్కరే టెండర్ వేయడం పంచాయతీ అధికారులు ఆయనకు ఖరారుచేశారు. గత ఏడాది రోజువారి పారిశుధ్య కార్మికులకు రూ. 290 చెల్లించేవారు. ఏడాది అదనంగా రూ.60 పెరగనుంది. వీటితో పాటు పంచాయతీ పరిధిలోని వివిద రకాల దుకాణాల నుంచి ఆశీలు వసూలు చేసేందుకు వేలం పాట వేశారు. దీన్ని ప్రతి సారి పాడే సరిపల్లి రామకృష్ణ దక్కించుకున్నారు. కార్య క్రమంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, కార్యనిర్వాహక కార్యదర్శి వీవీ అనురాధ పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

కలెక్టరేట్: జిల్లాలోని 27 మండలాలకు, మునిసిపాలిటీలకు నోడల్ అధికారులకు నియమిస్తూ కలెక్టర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నోడల్ అధికారులు మండల, మునిసిపాలిటీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టరుకు నివేదికలు అందజేయనున్నారు.

సమస్యలపై వినతులు

- మండల కేంద్రాల్లో, కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతులు సమర్పించిన ప్రజలు

జిల్లాలోని పలు మండలాల్లో స్థానికంగా సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లోనూ, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ పలువురు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.

మా భూములకు పట్టాలివ్వండి

దత్తిరాజేరు: తమ భూములకు పట్టాలు ఇప్పించాలని కోరపు కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ సుదర్శనరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన సుమారు 150 ఎకరాలను ఎన్నో ఏళ్లుగా సాగుచేస్తున్నామని, కోరపు రెవెన్యూ పేరుపై ఉండడంతో చాలా ఇక్కట్లు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే విత్తనాలు తదితర రాయితీలు, బ్యాంకులు లోన్లు, పంట నష్టపరిహారం వంటివి పొందలేకపోతున్నామన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఈ మేరకు 150 ఎకరాలకు తమ రైతుల పేరున పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని తహసీల్దార్‌ను కోరినట్టు ఆ గ్రామ సర్పంచ్ ప్రతినిధి కర్రి రామకృష్ణతోపాటు పలువురు రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అలాగే ఎంపీడీవో చంద్రకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలని..

నెల్లిమర్ల: తామస్‌పేట శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాల ని నెల్లిమర్లకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ చిక్కాల సాంబశివరావు, పూస పాటిరేగ ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు తదితరులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ అంబేద్కర్ ను కలిసి, వినతిపత్రం అందజేశారు. సర్వే నెం.27లోని ప్రభుత్వ ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటుకు గతంలో అప్పటి ఎమ్మెల్యే బడ్డుకొండకు నివేదించి, ఆయన అనుమతితో ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే జూట్‌మిల్లు యాజమాన్యం తమకు సంబంధం లేకపోయినప్పటికీ ఆ స్థలంపై హైకోర్టు నుంచి స్టేటస్‌కో ఉత్తర్వులు పొందిందని, ఆ ఉత్తర్వుల మేరకు పనులు నిలిపివేశామని కలెక్టర్‌కు వివరించారు. అయితే యాజమాన్యం ఒత్తిడితో స్థానిక రెవెన్యూ అధికారులు తాము నిర్మించిన గోడలను తీసేస్తామని హెచ్చరిస్తున్నారని ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కౌన్సిలర్లు చిక్కాల సుమతి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చొరవతో సమస్యల పరిష్కారం

చీపురుపల్లి: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఉన్న సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ దిశగా గట్టి ప్రయత్నాలు ప్రారంభించారని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండల పరిషత్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆయన పోలవరం, ఆమరావతి, భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో మాట్లాడారని చెప్పారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ఏకకాలంలో ప్రారంభం అవుతాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో వేల కోట్లలో అవినీతి జరిగిందని చెప్పారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, సారేపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి



పురిటిపెంటలో నిరసన చేపడుతున్న ఐద్వా నాయకులు

గజపతినగరం: రామభద్రపురం మండలంలో ఓ చిన్నారిపై అత్యాచారం చేయబోయిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పురిటిపెంట గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు నెలల పసికందుపై అత్యాచారం చేయడం సిగ్గుచేటన్నారు. గంజాయి మత్తులో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణవేణి, కె.సుందరి రాములమ్మ, ఎల్లారపు అచ్చయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణపై అవగాహన

గజపతినగరం: నిత్యావసర ధరలను తగ్గించి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకున్నామని సీఎస్‌డీటీ రవిశంకర్ తెలిపారు. సోమవారం గజపతినగరం, మెంటాడ రోడ్డులో రెండు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.181 ధర కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్‌లో రూ.160కే అందజేస్తున్నట్టు చెప్పారు. బియ్యం కిలో రూ.49, రూ.48కి అందిస్తున్నట్టు తెలిపారు గజపతినగరంలో లక్ష్మీ సత్యశ్రీనివాస్ ట్రేడర్స్, ఎస్.ఆర్.వెంకటేశ్వరరావు హోల్‌సేల్ షాపుల్లో స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

గజపతినగరం: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి మంగళవారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఏపీఓ సీహెచ్.రామారావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సార్పీ లక్ష్మణరావు పర్యవేక్షణలో 9 మంది డీఆర్పీలు గ్రామాల్లో పర్యటించి గతంలో చేపట్టిన పనులను పరిశీలించనున్నట్టు తెలిపారు. ఈనెల 16 నుంచి 27 వరకు గ్రామసభలు నిర్వహించి వేతనదారుల నుంచి వివరాలు సేకరించనున్నట్టు తెలిపారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

గజపతినగరం: కూటమి ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసి ఉద్యోగులను మోసగించే ప్రయత్నం చేస్తోందని, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకల చంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, లేదంటే ఉద్యోగుల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

నెల్లిమర్ల: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. సోమవారం ఆ విశ్వవిద్యాలయంలో అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ హాలును ఆమె చేతులమీదుగా ప్రారంభించారు. వైస్ చాన్సలర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్ వర్మ, అంతర్జాతీయ రిఫరీ ఆర్‌వీఎల్ఎన్ రత్నాకరరావు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.సూర్యనారాయణ, బి.వెంకట్రామయ్య, కోశాధికారి బి.సూరిబాబు, జిల్లా అధ్యక్షురాలు బి.లక్ష్మి నరేంద్ర, కార్యదర్శి చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. సోమవారం విశాఖ వచ్చిన ఆయనను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించినట్టు అసోసియేన్ రాష్ట్ర అధ్యక్షురాలు, జరజాపుపేటకు చెందిన అల్లుమల్లు మాధవి ఇక్కడి విలేకర్లకు తెలిపారు. తమను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోనికి తీసుకోవాలని, సీనియారిటీ లిస్టు ప్రకారం ఎంపీహెచ్ఏ(ఎఫ్)లుగా పదోన్నతి కల్పించాలని, తదితర 14 డిమాండ్లతో వినతిపత్రం అందజేసినట్టు ఆమె తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు ఏవీ నాగేశ్వరరావు, జి.సంధ్యారాణి, సుభాషిణి, దేవకి, శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

జీవన నైపుణ్యాల పెంపునకు కృషి

బాడంగి: బాడంగి పాఠశాలను జిల్లా సంకల్పం ప్రాజెక్టు కోర్డినేటర్ కె.శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. లైఫ్ స్కిల్స్ తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంచడానికి ఎస్సీ ఆర్టీ, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో సంకల్పం ప్రాజెక్టును రూపొందించిందన్నారు. మన జిల్లాలో 100 పాఠశాలల్లో నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. పాఠశాల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయుడు, ఒక యాక్టివ్ టీచర్ దీనిని నిర్వహిస్తారని తెలిపారు. పీడీ బంగారు నాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి మహిళా పోలీసుల విజ్ఞప్తి



ఎమ్మెల్యే కళాకు సమస్యను వివరిస్తున్న మహిళా పోలీసులు, ఎన్జీవో నాయకులు

చీపురుపల్లి: తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపించాలని గరివిడి మండల సచివాలయాల మహిళా పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. 2019లో ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుకూలంగా తమ నియామకాలు జరిగాయన్నారు. విధుల కేటాయింపులో ఇప్పటి వరకూ సరైన జాబ్ చార్ట్‌ను ప్రభుత్వం రూపొందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే మాతృ శాఖ కింద తాము విధులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్జీవో తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎల్.అప్పలనాయుడు, కార్యదర్శి బి.సురేష్, జాయింట్ సెక్రటరీ ఎల్.మనీషా తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్ వినియోగించుకోండి

రామభద్రపురం: మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌ను వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీకోసంలో వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

గజపతినగరం: జిల్లాలో వేలాదిగా ఉన్న కౌలు రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు టి.పైడిపినాయుడు కోరారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కౌలు రైతుల సంఘ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. గతంలో ఎండోమెంట్ అధికారులు మూడేళ్లకు ఒకసారి కౌలు ధర పెంచేవారని.. ప్రస్తుతం ఏటా బహిరంగ వేలం పెట్టడం సరికాదన్నారు. జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, టి.సోములు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పని ప్రదేశాల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు
- ప్రత్యేక సమావేశాల నిర్వహణ



డెంకాడలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసిన దృశ్యం

చీపురుపల్లి: పని ప్రదేశాల్లో తప్పనిసరిగా ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు సూచించారు. చీపురుపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది మందికి పైగా పని వారు ఉండే పని ప్రదేశాలు, కార్యాలయాల్లో ఐసీసీలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013పై అధికారులంతా అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కమిటీల్లో 50శాతం మంది మహిళలుండే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కర్లాం వైద్యాధికారి డా.సువర్ణ, డీటీ సంతోష్, ఇన్‌చార్జి సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్లు మంగమ్మ, ఉపాధి ఏపీవో భాగ్యలక్ష్మి, ఎన్‌జీవో ప్రతినిధి ఝాన్సీ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● **డెంకాడ:** మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు కఠిన చట్టాలు తీసుకు రావాలని తహసీల్దార్ రామారావు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి, ఐసీడీఎస్ సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేసి, అన్ని శాఖల సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ● **గరివిడి:** పని ప్రదేశంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించేందుకు ప్రత్యేక ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ ఏర్పాటు చేసేందుకు సోమవారం గరివిడిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో గవర మధుసూధనరావు, సీడీపీవో ఆరుద్ర నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో మహిళలకు ఎటువంటి వేధింపులు జరిగినా కమిటీ చర్యలు చేపడుతుందని అధికారులు తెలిపారు. ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ అధ్యక్షుడిగా తహసీల్దార్, కన్వీనర్‌గా ఎంపీడీవో, సభ్యులుగా సీడీపీవో, వెలుగు ఏపీఎం ఇతర సభ్యులు ఉంటారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ● **వేపాడ:** మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పని ఎంపీడీవో నిచ్చల హెచ్చరించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టం-2013 అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ సత్యం, ఎంఈవో బాల భాస్కరరావు, వైద్యాధికారి ధరణి, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు. ● **కొత్తవలస:** మహిళలను వేధింపులకు గురిచేస్తే అటువంటి వారిని కఠిన శిక్షలు విధించేలా చట్టాలకు మరింత పదును పెట్టారని తహసీల్దార్ చంద్రశేఖరరావు, ఎంపీడీవో రమణయ్య, ఎంఈవో బండారు శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్.ఉమాదేవి అధ్యక్షతన పనిచేసే ప్రాంతంలో మహిళల వేధింపులు అన్న అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో వెలుగు, ఉపాధి ఏపీఎంలు శ్రీనివాసరావు, జనార్దనరావు, న్యాయవాది డి.శ్రీనివాస్, ఏఎస్ఐ ప్రకాష్, కొత్తవలస, వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు సీతల్‌వర్మ, సీతాలక్ష్మి, గోపాలకృష్ణ, సింహాద్రినాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీపై ఫిర్యాదు

భోగాపురం: సవరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చోరీపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ వర్కర్ శాంతికుమారి, మహిళా పోలీసు త్రివేణి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ వర్కర్ శాంతికుమారి ఎప్పటిలాగే ఈనెల 13న అంగన్‌వాడీ కేంద్రం మూసి వేసి వెళ్లిపోయారు. మళ్లీ సోమవారం ఉదయం వచ్చి తలుపులు తీయగా అంగన్‌వాడీ కేంద్రం చిందరవందరగా ఉంది. అందులో రెండు ఫ్యాన్లు, 10 ట్రేల గుడ్లు, ఒక గ్యాస్ సిలిండర్లు చోరీకి గురైనట్టు ఆమె గుర్తించారు. ఐసీడీఎస్ ప్రోజెక్టు అధికారి ఎస్తేర్‌రాణి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

రెస్కో ఉద్యోగికి సాయం

గరివిడి: కోనూరు గ్రామంలో విధులు నిర్వహిస్తున్న రామలింగాపురానికి చెందిన ఆర్‌ఈసీఎస్ ఉద్యోగి గడ్డపర్తి రాజుకు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. గడపర్తి రాజు రెస్కో సంస్థలో ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి రెండు కాళ్లు విరిగి, మంచాన పడ్డారు. ఈ విషయాన్ని కోనూరు మాజీ సర్పంచ్, టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వెంపడాపు రమణమూర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి, రెస్కో సంస్థ ద్వారా రూ.25వేలు మంజూరు చేయించారు. ఈ మొత్తాన్ని సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెస్కో ఉద్యోగి రాధాకృష్ణ రాజు, రమణమూర్తి పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మించండి

భోగాపురం: రాజాపులోవ పంచాయతీ మహరాజపేట గ్రామంలో సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ రహదారి, కాలువలు సక్రమంగా లేకపోవడంతో వాడుక నీరంతా రహదారిపైనే ఉండడంతో గోతులమయంగా మారింది. కొద్దిపాటి వర్షం పడినా రహదారి అంతా నీరు నిలిచిపోతోందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయం అయిన రహదారి

ఘనంగా నైపుణ్యాల దినోత్సవం

విజయనగరం దాసన్నపేట: నగరంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రపంచ యువత నైపుణ్యాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెట్విజ్ సీఈవో రామగోపాల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్య శిక్షణను ఉపయోగించుకుని ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరి, జిల్లా నైపుణ్యాధికారి నీలం గోవిందరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జిల్లా పరిశ్రమల శాఖ ఐపీఓ వర్గన్, సీడాప్ ప్రతినిధి మార్టిన్, జనశిక్షణ సంస్థాన్ ప్రతినిధి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో

నగర శివార్లలోని ఆర్కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున హాజరై మాట్లాడుతూ నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.సురేష్, సీహెచ్ నాగరాజు, జీఎంఆర్ అసోసియేట్ కేవీ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్‌లో 'అమ్మకోసం ఓ మొక్క'

నెల్లిమర్ల: వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు సోమవారం 'అమ్మ కోసం ఓ మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో మదర్స్ గార్డెన్ పేరుతో అధిక సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.ఎన్‌టీ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం జోన్ టీంకు ఎంపిక

శృంగవరపుకోట: ఢిల్లీలో సెప్టెంబరులో నిర్వహించనున్న ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీట్ పోటీలకు ఏపీఎస్‌ఆర్టీసీ తరఫున పాల్గొనేందుకు విజయనగరం జోన్ టీంకు ఎస్.కోట డిపో మేనేజర్ కె.రమేష్, ఉద్యోగులు ఎంపికయ్యారు. ఆదివారం విశాఖపట్టణంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆఫీసర్ల కేటగిరిలో 1000 మీటర్లు ఫాస్ట్ వాకింగ్ విభాగంలో డిపో మేనేజర్ రమేష్, జావిలిన్‌త్రో, 400మీటర్లు, పరుగుకు కండక్టర్ జి.ఎస్.కుమార్ ఎంపికయ్యారు. జోనల్ స్థాయిలో ఎన్నికైన వారికి ఆగస్టు 3న రాష్ట్ర స్థాయి ఎంపికలు విజయవాడలో నిర్వహించనున్నారు. అక్కడ ఎంపికైన వారిని ఢిల్లీ పంపిస్తారు.

క్లుప్తంగా..

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చీపురుపల్లి: గరివిడి మండలం ఐతాంవలస గ్రామానికి చెందిన చుక్కల చంద్రయ్య ఆర్‌డబ్ల్యూఎస్‌లో కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తూ ఇటీవల విధి నిర్వహణలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సంబంధిత కాంట్రాక్టర్ బి.శేషగిరిరావు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.50వేలు సాయం అందజేశారు.

చంద్రబాబును కలిసిన బంగార్రాజు



చంద్రబాబుతో బంగార్రాజు

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం విజయవాడంలోని సీఎంవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పరిస్థితులపై చర్చించారు.

ఎమ్మెల్యే నాగమాధవికి పవన్ సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవిని ఆ పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సోమవారం ఘనంగా సత్కరించారు. విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమెను సత్కరించి, అభినందించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

డెంకాడ: గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మోపాడ పంచాయతీలోగల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అక్రమంగా పశువుల షెడ్లను నిర్మించారు. ఈ ఆక్రమణపై ప్రస్తుత ఎమ్మెల్యే నాగమాధవి ఇటీవల సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక అధికారులు ఈ నిర్మాణాలను తొలగింపజేశారు.

ఎక్కడ చూసినా మందుబాబులే

- మద్యం షాపు ఆవరణలోనే తాగుడు
- కిరాణా షాపుల్లోనూ..
- ఇబ్బందులు పడుతున్న రెడ్డికంచేరు వాసులు

భోగాపురం: ఆ గ్రామంలో ఎక్కడ చూసినా మందుబాబులే దర్శనమిస్తున్నారు. మద్యం షాపులతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కిరాణా షాపుల వద్ద నిరంతరం తాగుతూ కనిపిస్తున్నారు. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదీ రెడ్డికంచేరు గ్రామంలోని దుస్థితి. మద్యం షాపు ఆవరణలో మద్యం తాగకూడదని నిబంధన ఉన్నప్పటికీ అక్కడే గుంపులు గుంపులుగా కూర్చుని మద్యం తాగుతుంటారు. గ్రామంలోని రహదారి చుట్టుపక్కల ఉన్న కిరాణా షాపుల్లో కూడా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో ఆ షాపుల వద్ద నిరంతరం మందుబాబులు దర్శనమిస్తుంటారు. రోడ్డుపైనే మద్యం మత్తులో తిరుగాడుతూ ఉంటారు. ఆ రహదారి గుండా ఉన్నత పాఠశాలకు వెళ్లే బాల బాలికలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రహదారికి ఇరువైపులా మద్యం అమ్మకాలు సాగకుండా చూడాలని, ప్రభుత్వ మద్యం దుకాణం ఆవరణలో మద్యం తాగకుండా నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



మద్యం దుకాణం ఆవరణలో మద్యం తాగుతున్న దృశ్యం

వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారు

ఈ మందుబాబులంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకు వచ్చారు. వీరిని ఏమీ చేయలేకపోతున్నాం.

- సన్యాసిరావు, ఎక్సైజ్ కానిస్టేబుల్

చర్యలు తీసుకుంటాం

రెడ్డికంచేరు గ్రామంలో మద్యం షాపులు నిర్వహిస్తున్నవారికి ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. మరొక్కసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, సీఐ, భోగాపురం

రాయితీపై మొక్కలు

శృంగవరపుకోట: ఏపీ ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు రాయితీపై కొబ్బరి, మామిడి, జీడిమామిడి పంపిణీ చేస్తున్నట్టు గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జీయో) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తెలిపారు. మొక్కలు కావాల్సిన వారు 9391138665 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.